క్లుప్తంగా

ఏబీసీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



గుడ్లవల్లేరు: ఏపీలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఏబీసీ వర్గీకరణను ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం గుడ్లవల్లేరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఏబీసీ వర్గీకరణ అమలు అయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలు ఆపాలన్నారు. వర్గీకరణకు మద్దతు పలికిన వైఎస్సార్ సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సుధాకర్, ప్రశాంతి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరు: నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కొతవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ మాధవి తెలిపారు. శుక్రవారం మండలంలోని డోకిపర్రులో నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళలకు రక్తపోటు, మధుమేహం, రొమ్ము క్యాన్సరు తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వీరమాచినేని శివప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలి



వేములమడ(మొవ్వ): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ఆయా ఇళ్లలోని పురుషులు దృష్టి సాగించాలని సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి సూచించారు. మొవ్వ మండలం కూచిపూడి సెక్టార్ పరిధిలోని వేములమడ పంచాయతీలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా శుక్రవారం రాష్ట్రీయ పోషణ మహోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు జి.శివకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పికట్లలో..

అప్పికట్ల (పెదపారుపూడి): పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతులైన బిడ్డలు జన్మిస్తారన్ని పెదపారుపూడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. మండలంలోని అప్పికట్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగిస్తే చాలా మంచిదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాపారులకు అవగాహన



గుడివాడ టౌన్: చిరు వ్యాపారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి వారి ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో చిరు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులకు తొలుత రూ 15,000 తదుపరి రూ 25,000 మూడో విడత రూ 50,000 ఋణం అందజేస్తారన్నారు. వీటిని వినియోగించుకొని చిరు వ్యాపారులు అభివృద్ధి చెందాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. గతంలో దరఖాస్తు చేసుకొని లోను రాని వారికి సైతం ఇప్పుడు లోన్ వచ్చేలా ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం వ్యాపారులకు క్యూఆర్ కోడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ పృథ్వీరాజ్, యూపీఐ మేనేజర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి

కలిదిండి(కైకలూరు): ప్రముఖ పాత్రికేయుడు, నాటకకర్త, మహాకవి, కళా ప్రపూర్ణ బిరుదాంకితులు చిలకమర్తి లక్ష్మీ నరసింహం సమాజానికి చేసిన సేవలను నేటితరం గుర్తుంచుకోవాలని కలిదిండి శాఖ గ్రంథాలయాధికారి జే.రమేష్‌బాబు పేర్కొన్నారు. కలిదిండి గ్రంథాలయంలో నరసింహం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రౌపది పరిణయం, సీతా కల్యాణం, పారిజాతాపహరణం, గయోపాఖ్యానం అనేవి లక్ష్మీనరసింహంలో ప్రతిభకు తార్కాణాలన్నారు.

శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే..

దసరా నవరాత్రుల్లో భాగంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లోని అమ్మవార్లు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం శ్రీ మహాలక్ష్మి, గజలక్ష్మి, సంతాన లక్ష్మిగా అమ్మవార్లను అలంకరించారు. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.



కొతవరంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితో పాటు కొతవరం శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు శ్రీ గజలక్ష్మీ దేవిగా, అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవిగా, డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు శ్రీ సంతాన లక్ష్మీ దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. విశేషాభిషేకాలను అందుకున్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించిన అలంకారాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. బాల కుమారి, సువాసిని పూజలు నిర్వహించారు. విశ్రాంతి ఉపాధ్యాయులు చింతల పాటి రామకృష్ణ (ఉయ్యూరు) ఆధ్వర్యంలో రామలింగేశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన సన్నిధి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం అనంతరం లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు, మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు పాల్గొన్నారు. డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ఊంజల్ సేవను నిర్వహించారు.

ధనలక్ష్మీ దేవిగా..

పామర్రు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లోని అమ్మవార్లను ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు. స్థానిక బుచ్చమ్మ ఆశ్రమంలోని పర్వత వర్ధనీదేవిని, విజయవాడ రోడ్డులోని అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజ జరిపించారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు హనుమశాస్త్రి, భవానీ శంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవపూడి విజయ దుర్గాంబ ఆలయంలో లలితాదేవీగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకుడు దాసరి భగవాన్‌దాసు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు

గుడివాడలో..

గుడివాడటౌన్: దసరా ఉత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ గజలక్ష్మి దేవిగా, వేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీ ధనలక్ష్మి దేవిగా, వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ ధనలక్ష్మి దేవిగా అలంకరించారు.

నందివాడలో..

నందివాడ: మండలంలోని లక్ష్మీనరసింహపురంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సుమారు రూ.16,23,200తో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కైకలూరు శ్యామలాంబ ఆలయంలో చండీ మహాయోగ పూజల్లో దంపతులు



కైకలూరు వెలంపేటలో ధనలక్ష్మీదేవి

కైకలూరు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అమ్మవార్ల ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఐదో రోజు కై కలూరు శ్యామలాంబతల్లి, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, లోకుమూడిగరువు దత్తాశ్రమంలో అమ్మవార్లు ధనలక్ష్మీదేవీ అలంకరంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్యామలాంబ ఆలయ ఆవరణలో నిర్వహించిన చండీమహాయాగంలో 26 మంది దంపతులు పాల్గొన్నారు. ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో కనకదుర్గామాత మహాలక్ష్మీదేవిగా నీరాజనాలు అందుకున్నారు.

కైకలూరు శిరిడి సాయిబాబా మందిరంలో దశావతార మహోత్సవాల్లో భాగంగా బాబా వామనావతారంలో దర్శనమిచ్చారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దసరా మహోత్సవాల్లో అమ్మవారికి గులాబీ పుష్పార్చన చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కైకలూరు వెలంపేటలో కరెన్సీతో అలంకరించిన ధనలక్ష్మీ అవతారం ఆకట్టుకుంది. దత్తాశ్రమంలో గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో అన్నదానం, కుంకుమపూజలు జరిగాయి.



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న అనివేటి మండపం

శోభాయమానం



కనక దుర్గాదేవి విద్యుద్దీపాల కటౌట్



విద్యుత్ కాంతుల వెలుగులో టార్పాలిన్ మండపం

గుడ్లవల్లేరు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయం విద్యుద్దీపాలతో శోభాయమానంగా మారిపోయింది. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రధాన ఎంఎన్‌కే రహదారిపై ఆలయం వారు ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గా దేవి విద్యుద్దీపాల కటౌట్ ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. ప్రధాన రహదారిపై భారీ టార్పాలిన్ మండపానికి కాంతులు, అమ్మవారి కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్‌లకు విద్యుద్దీపాలు, అమ్మవార్ల ప్రతిమలు, అనివేటి మండపాలపై రంగు రంగుల విద్యుద్దీపాల కాంతులీనుతున్నాయి.



దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో లలితాదేవీగా అమ్మవారు



పామర్రులో ధనలక్ష్మీ దేవిగా అంకమ్మ తల్లి



పామర్రులో సామూహిక కుంకుమ పూజ



వేమవరంలో గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా..



గుడివాడలో శ్రీ గజలక్ష్మీ దేవిగా అమ్మవారు



లక్ష్మీనరసింహపురంలో ధనలక్ష్మీదేవిగా అమ్మవారు

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



కైకలూరులో అనుబంధ విభాగాల అధ్యక్షులతో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఇటీవల కైకలూరు మండల పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎన్నికైన పలువురు కైకలూరు పార్టీ కార్యాలయంలో డీఎన్నార్‌ను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. డీఎన్నార్‌ను కలిసిన వారిలో యువజన విభాగ అధ్యక్షుడు ఫిర్దోజ్‌ఖాన్, మహిళా విభాగ అధ్యక్షుడు జంగం నిర్మలా జ్యోతి, రైతు విభాగ అధ్యక్షుడు సలాది వెంకటేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మారగాని రంగారావు, ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షుడు శికా ఏసు మణి, పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు బత్తుల వాసు, వైఎస్సార్ యూనియన్ విభాగ అధ్యక్షుడు బోదావుల సాయి, వైఎస్సార్‌టీఎఫ్ విభాగ అధ్యక్షుడు పాణ్యం కిరణ్, అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలు ఆరేపల్లి శివలక్ష్మీ, సోషల్ మీడియా విభాగ అధ్యక్షుడు జామ్మి రాంబాబు, ప్రచార విభాగ అధ్యక్షుడు భోగేశ్వరరావు, బూత్ కమిటీ విభాగ అధ్యక్షుడు రాజశేఖర్ ఉన్నారు.

రోడ్డు మరమ్మతులకు గ్రామస్తుల శ్రమదానం



రోడ్డును బాగు చేస్తున్న గ్రామస్తులు

గుడ్లవల్లేరు: మండలంలోని మామిడికోళ్ల నుంచి కొతవరం ఒకటో వార్డు వరకు ఉన్న ప్రధాన రహదారి కాలి నడకకు కూడా కష్టతరంగా మారింది. మోకాలు లోతు గుంతలు, మొన తేలిన కంకర రాళ్ల వాహన చోదకులకే గాకుండా పాదచారులకు కూడా ప్రయాణంలో అగచాట్లకు గురి చేస్తున్నాయి. ఈ రోడ్డులో చాలామంది ప్రమాదాల గుర్రై తీవ్ర గాయాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తమ గ్రామ ప్రధాన రహదారిని మామిడికోళ్ల గ్రామస్తులు సమష్టిగా బాగు చేసుకున్నారు. శ్రమదానంతో రహదారిపై ఉన్న గుంతల్లో మట్టిని పోశారు. మొక్కలను శుభ్రం చేశారు. మాజీ సర్పంచ్ తోట మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ తోట రాధిక తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి

పామర్రు: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఒడుగు గంగాధర ప్రసాద్, ఉపాధ్యక్షుడు వేము పెదబాబులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సీహెచ్‌సీలో నియమించిన కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించటం లేదన్నారు. జీతాలు చెల్లించాలని ఏజెన్సీ పీఆర్‌ఓ కృష్ణ ప్రసాద్‌కు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గుడ్లవల్లేరు: వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించుకుని నాటక, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గుడివాడ పాదర్తి సిస్టర్స్ కూచిపూడి నత్యప్రదర్శన, చిన్నాపురం శ్రీ బాలసరస్వతి నాట్యమండలి వారిచే బాలనాగమ్మ పౌరాణిక నాటకం తదితర కార్యక్రమాలు అలరించాయి. కళాకారులన దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు సన్మానించారు.

సంస్కారహీనుడు బాలకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సంస్కారహీనుడని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో దేశంలోనే గొప్ప పేరు తెచ్చుకున్న నటుడిగా చిరంజీవిని హేళన చేస్తూ కించపరిచే విధంగా మాట్లాడటంతో బాలకృష్ణ పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. శాసనసభ సాక్షిగా బాలకృష్ణ చిరంజీవిని హేళన చేసి మాట్లాడినా ఆయన తమ్ముడు పవన్ కల్యాణ్ స్పందించకపోవడం అతని చేతగాని తనానికి నిదర్శనమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూడా బాలకృష్ణ చేసిన వ్యాఖ్య అత్యంత హేయమైందన్నారు. విశ్వాసం లేని వ్యక్తి బాలకృష్ణ అని పేర్కొన్నారు. వైఎస్సార్ కుటుంబం తనకు చేసిన మేలును మర్చిపోయిన విశ్వాస ఘాతకుడు బాలకృష్ణ అని విమర్శించారు. ఈ విధమైన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. వాటిని మానుకోకపోతే ప్రజలే ఆయనకు బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, నాయకులు అడ్డేపల్లి పురుషోత్తం, షేక్ సయ్యద్, అడపా హర్ష, జ్యోతుల మణికంఠ, గంట సురేష్, కలపాల కిరణ్, పుల్లేటికుర్తి కష్టారావు, షేక్ దాదా మట్ట జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొరిశెట్టి నాగేశ్వరరావు

గుడివాడ టౌన్: రైతుకు మేలు జరగాలంటే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కనీస మద్దతు ద్వారా చట్టబద్ధతే పరిష్కారమన్నారు. ప్రభుత్వ సంస్థల ద్వారా రైతుల పంటలు కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ హస్తగతం చేయటం సరికాదన్నారు. ప్రస్తుతం ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రం దృష్టి పెట్టాలన్నారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో తేవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వై.కేశవ, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా అందరం కలిసి పని చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పామర్రు, పమిడిముక్కల మండలాల క్లస్టర్ స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు రెండురోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న వారిని గుర్తించి, వారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పామర్రు ఎంపీడీఓ కె జ్యోతి, ఈఓపీఆర్డీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో తప్పులను సరి చేసుకోండి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో తమ ఆధార్ కార్డుల్లోని తప్పులను ప్రజలు సరి చేసుకోవాలని గ్రామ కార్యదర్శి ఏజీఎల్ నరసింహారావు కోరారు. శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో డేట్ ఆఫ్ బర్త్, ఇంటి పేరు, అడ్రసు, వయసు, ఫోన్ నంబర్ వంటి అంశాలను సరి చేసుకునేందుకు ఈ ఆధార్ కేంద్రం ఉపయుక్తమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజలందరికీ దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి

కలిదిండి(కైకలూరు): దసరా సందర్భంగా దుర్గమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ దక్కాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. నియోజకవర్గ పార్టీ ప్రచార విభాగ అధ్యక్షుడు పాము రవికుమార్ ఆహ్వానం మేరకు మండలంలోని పడమటిపాలెం గంగానమ్మ గుడి వద్ద దసరా మహోత్సవాల్లో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎండీ గాలిబ్ బాబు, కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు నిలపాల వెంకటేశ్వరరావు, చిట్టూరి నాంచారయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా విభాగ అధ్యక్షుడు మండా నవీన్, నాయకులు పెమ్ము గోపి, చిట్టూరి బుజ్జి, ఫిర్దోజ్ ఖాన్, మారగాని రంగారావు తదితరులు పాల్గొన్నారు.